క్లుప్తంగా

ఎన్‌సీడీ సర్వే లక్ష్యం సాధించాలి

కర్నూలు(హాస్పిటల్): నాన్ కమ్యూనికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ), కమ్యూనికబుల్ డిసీజ్(సీడీ) సర్వే లక్ష్యాలను వంద శాతం సాధించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య అధికారిణి హేమలత చెప్పారు. కర్నూలులోని వైఎస్‌ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రాల వైద్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో డీపీఎంయూ డాక్టర్ ఉమా, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

కర్నూలు (టౌన్) : నగరంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ చెప్పారు. శుక్రవారం స్థానిక కుమ్మరిగేరిలో 127, 216 పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, కర్నూలు అర్బన్ ఎంఆర్‌ఓ విజయశ్రీ, నగర పాలక రెవెన్యూ అధికారి జునీద్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఘటనపై విచారణకు హెచ్ఆర్‌సీ ఆదేశం

కర్నూలు(సెంట్రల్): శ్రీకాళహస్తిలో ఓ వ్యక్తిపై పోలీసులు చేయి చేసుకున్నారనే ఘటనపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్‌సీ) విచారణకు ఆదేశించింది. సాయి అనే వ్యక్తిపై శ్రీకాళహస్తి సీఐ అంజుయాదవ్ చేయిచేసుకున్నారని మీడియాలో వచ్చిన కథనాలను హెచ్‌ఆర్‌సీ సుమోటోగా తీసుకొని విచారణ చేపట్టింది. శ్రీకాళహస్తి పోలీసుస్టేషన్ సీఐ అంజుయాదవ్, స్టేషన్ ఆఫీసర్, తిరుపతి డీఎస్పీ, తిరుపతి ఎస్పీ, అనంతపురం రేంజ్ డీఐజీ, తిరుపతి కలెక్టర్, డీజీపీ, హోంసెక్రటరీ, చీఫ్ సెక్రటరీలకు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఈ నెల 27వ తేదీన నివేదిక సమర్పించాలని సీఐ, డీఎస్పీ, ఎస్పీలను ఆదేశించింది.

దళిత బాంధవుడు జగన్

కర్నూలు(సెంట్రల్) :సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత, గిరిజన బాంధవుడని, ఆయనకు ఆయా వర్గాలు ఎప్పటికీ రుణ పడి ఉంటాయని డీసీఎంసీ మాజీ సభ్యుడు సత్తి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

పీటీడీలో కారుణ్య నియామకాలు

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు భర్తీ చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 19 మందికి అవకాశం రాగా ఇందులో 18 మంది అసిస్టెంట్ మెకానిక్‌లు కాగా ఒకరు డ్రైవర్. వీరిలో తొమ్మిది మంది అసిస్టెంట్ మెకానిక్‌లను కర్నూలు జిల్లాకు, మిగిలిన వారిని నంద్యాల జిల్లాకు కేటాయిస్తూ జిల్లా ప్రజా రవాణ శాఖాధికారి టి. వెంకటరామం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజల జీవితాలను మెరుగు పరిచేలా పరిశోధనలు

కర్నూలు (న్యూసిటీ) : విశ్వవిద్యాలయాల్లో జరిగే పరిశోధనలు ప్రజల జీవితాలను మెరుగుపరిచేవిధంగా ఉండాలని రాయలసీమ విశ్వవిదాలయం రెక్టార్ ఆచార్య సీవీ.కృష్ణారెడ్డి అన్నారు. వర్సిటీలో బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ విభాగాల సమన్వయకర్తలు డాక్టర్ మౌనిక, డాక్టర్ స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ట్రాన్సిలేషనల్ రీసెర్చ్' అకడమిక్ టు ఇండస్ట్రీ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు వివిధ వర్సిటీల ప్రొఫెసర్లు హాజరై మాట్లాడారు. వర్సిటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లతోపాటు నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆచార్య రాజగోపాల్, డాక్టర్ ఆంటోని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ, అనుబంధ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

శాకాంబరీ..నమోస్తుతే!



సాయిూశ్వరాలయంలో శాకంబరీ దర్శనం

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేశారు. వివిధ రకాల ఆకు కూరలు, కూరగాయలతో శాకాంబరీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నెహ్రూ నగర్‌లోని సత్యసాయి మందిరంలోని సాయీశ్వరాలయంలో అమ్మవారిని లలితా సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. సత్య సాయి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో లలితా అమ్మవారికి కూరగాయలతో శాకంబరీగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. రంగధామం పారాయణ బృందం అధ్యక్షుడు బిలకంటి మురళీధర్ బృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణం, హనుమాన్ చాలీసా, మహాలక్ష్మి అష్టకం భజన సంకీర్తనలు జరిగాయి. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి భక్తులకు సందేశమిచ్చారు.

ఎప్పుడో 60 ఏళ్ల క్రితం వచ్చిన పాతాళభైరవి సినిమాలో ఒకసారి మాంత్రికుడు, మరోసారి కథానాయకుడు తల, చేతిని నరుక్కుని తిరిగి అతికించుకుంటారు. రెండు దశాబ్దాల క్రితం వచ్చిన ఆంగ్ల చిత్రం ఫేస్ ఆఫ్‌లో హీరో ముఖాన్ని విలన్ ముఖంగా మారుస్తారు. కొన్నేళ్ల క్రితం వచ్చిన తెలుగు సినిమా ఎవడు లోనూ హీరో చనిపోతే అతనికి మరో వ్యక్తి ముఖాన్ని రూపుదిద్దుతారు. ఇవన్నీ ప్లాస్టిక్ సర్జరీ ద్వారా జరిగిన అద్భుతాలు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఈ రంగం వైద్యులు విశేషంగా రాణిస్తున్నారు. నేడు (శనివారం)జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం.

వైద్యం..అపురూపం

- ప్లాస్టిక్ సర్జరీలో విప్లవాత్మక మార్పులు
- దెబ్బతిన్న శరీర భాగాల స్థానంలో సర్జరీతో యథాస్థితి
- పెద్దాసుపత్రిలో ఏటా 2,500లకు పైగా ఆపరేషన్లు
- పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ సర్జరీ విభాగం
- ఇటీవల పీజీ సీట్లు మంజూరు
- నేడు జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం



ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): ప్లాస్టిక్ సర్జరీలోని ప్లాస్టిక్ అనేది ప్లాస్టికోస్ అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. ప్లాస్టికోస్ అంటే మలచడం అని అర్థం. ప్రమాదాలు, జన్మతః వచ్చిన వికారాలను వైద్యులు శస్త్ర చికిత్స ద్వారా చూడచక్కని ఆకారం తెప్పించగలడం. ఇప్పుడు ఈ వైద్య విభాగానికి సమాజంలో మంచి గుర్తింపు లభిస్తోంది. విరిగిన శరీర అవయవాన్ని పరిమిత సమయంలో తీసుకొస్తే వైద్యులు వెంటనే అతికించగలిగే టెక్నాలజి అందుబాటులోకి వచ్చింది. రెండు దశాబ్దాల క్రితం కర్నూలులో ఇద్దరే ప్లాస్టిక్ సర్జన్లు ఉండేవారు. వారిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఒకరు పనిచేస్తుండగా, ప్రైవేటులో మరొకరు పనిచేసేవారు. ఈ కారణంగా ఎవరైనా ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ చేయించుకోవాలంటే నెలల తరబడి సమయం పట్టేది. ఇప్పుడు ప్లాస్టిక్ సర్జన్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ వీరి సంఖ్య గణనీయంగా మెరుగైంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఒక ప్రొఫెసర్ డాక్టర్ మంజులబాయి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజారవి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ విజయచంద్రమౌళి, డాక్టర్ సింధు ప్రియాంక, డాక్టర్ భారతి ఉన్నారు. ఈ కారణంగా ఇటీవల పీజీ సీట్లు సైతం ఈ విభాగానికి మంజూరయ్యాయి. అదనంగా పీజీ వైద్యులు సైతం ఈ విభాగంలో రోగులకు సేవలందిస్తున్నారు. దీంతో ఒకప్పటిలాగా ఆపరేషన్‌కు నెలల తరబడి వేచి ఉండాల్సిన పని లేకుండా వారం, పదిరోజుల్లోనే పూర్తవుతోంది. ప్లాస్టిక్ సర్జరీలో భాగంగా గ్రహణమొర్రి, పుట్టుకతో వచ్చే అంగవైకల్యాలను సరిచేయడం, ఫేషియల్ సర్జరీ, ట్రామా అండ్ మ్యాక్సిలో ఫేసియల్ ఫ్రాక్చర్స్, రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ, కాస్మోటిక్స్, ముక్కు సర్జరీ, ముఖంపై గాయాలు, చేతిగాయాలకు చికిత్స, చర్మం వేయడం, ఫ్లాప్ సర్జరీ, హైపోస్పేడియాసిస్, కాలిన గాయాలకు చికిత్స, గైనకోమాస్టియా(మగవారిలో పెరిగిన రొమ్ములను సరిచేయడం), రొమ్ము పెంచడం వంటి చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి.

ఏటా 2,500లకు పైగా శస్త్రచికిత్సలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంతో పాటు దానికి అనుబంధంగా కాలిన రోగుల వార్డు కూడా ఉంది. కర్నూలు, నంద్యాలతో పాటు వైఎస్‌ఆర్ కడప జిల్లా, రాయచోటి, అనంతపురం, శ్రీసత్యసాయి, ప్రకాశం, కర్ణాటకలోని బళ్లారి, రాయచూరు, తెలంగాణాలోని మహబూబ్‌నగర్, గద్వాల జిల్లా వాసులూ ఇక్కడికే చికిత్స కోసం వస్తున్నారు. ఈ విభాగానికి ప్రతి సోమ, గురువారాలు ఓపీ ఉంటుంది. ఓపీ రోజుల్లో 45 నుంచి 50 మంది రోగులు చికిత్స కోసం వస్తారు. ప్రతి సంవత్సరం 2,500 దాకా చిన్నా, పెద్దా ఆపరేషన్లు ఇక్కడ నిర్వహిస్తున్నారు.



ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి నూతన భవనం

నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ ది బర్న్ ఇన్‌జ్యూరీస్(ఎన్‌పీపీడీబీఐ) కింద కేంద్ర ప్రభుత్వం 2017 మార్చిలో రూ.4.5కోట్ల ప్రాజెక్టును మంజూరు చేసింది. ఇందులో రూ.2.5 కోట్లను కేంద్రం, 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉన్నా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 2019 వరకు మంజూరు చేయలేదు. అయితే ప్రస్తుత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవనంతో పాటు ఆధునిక వైద్యపరికరాలు రానున్నాయి. ఒక ప్లాస్టిక్ సర్జన్/బర్న్స్/జనరల్ సర్జన్, ఇద్దరు అనెస్తెటిస్ట్స్, నలుగురు మెడికల్ ఆఫీసర్స్, 12 మంది స్టాఫ్‌నర్స్‌లు, ఒక ఓటీ టెక్నీషియన్, ఇద్దరు డ్రెస్సెర్స్, ఇద్దరు మల్టీపర్పస్ రిహాబిటేషన్/సీబీఆర్ వర్కర్స్, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్, 12 మంది మల్టీపర్పస్ వర్కర్స్(నర్సింగ్ ఆర్డర్లీ/నర్సింగ్ అటెండెంట్స్/సఫాయి కర్మాచారి)లు అదనంగా నియమితులవుతారు. తద్వారా ప్లాస్టిక్ సర్జరీ, కాలిన రోగుల విభాగాలకు వచ్చే రోగులకు మరింత నాణ్యమైన వైద్యం అందే అవకాశం ఉంది.



ఆపరేషన్‌కు ముందు, తర్వాత చిన్నారులు

పెద్దాసుపత్రిలో నాణ్యమైన వైద్యసేవలు



ఆసుపత్రిలోని ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం వైద్యులు ఉండటంతో పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో పీజీ వైద్యులు కూడా వచ్చారు. ఈ కారణంగా ఇక్కడ చేరే రోగులకు సత్వర చికిత్స, నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన మెడికల్ కాలేజీ ఆవరణలోని శుశ్రుతుడు విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో పేపర్ ప్రెజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.

–డాక్టర్ ఎం. మంజులాబాయి, ప్లాస్టిక్ సర్జరీ హెచ్ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ప్రజల చెంతకే పాలన

జగనన్న సురక్షలో ఎమ్మెల్యే కాటసాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలనను తీసుకొచ్చిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 20వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను, సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తుందన్నారు. సేవలకు సంబంధించిన వివిధ ధ్రువీకరణ పత్రాలకు గతంలో అనే ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు తాము ఇంటి దగ్గరికే వచ్చి అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నాగలక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు భీమశంకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

- 29వ వార్డు శరీన్‌నగర్‌లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి ధ్రువీకరణ పత్రాలు అందించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు బాషా, హుస్సేన్ ఆలం, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఆగస్టు 31కి రీసర్వే పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (సెంట్రల్) : ఆగస్టు 31వ తేదీకి భూ రీసర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వివిధ అంశాల మీద జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చాలా మండలాల్లో రీసర్వే నెమ్మదిగా జరుగుతుందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కన్నమడకల, లొద్దిపల్లెలో 9(2) నోటీసులు ఇచ్చి రీసర్వే త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్టోన్ ప్లాంటేషన్ పనులు వెంటనే చేయాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం కింద సేవలు త్వరగా అందజేసి జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నవి అని, అయితే, అందులో అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూడాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు జాగ్రత్తగా చేయాలన్నారు. గ్రామాల్లో ఎస్సీ శ్మశాన వాటికలకు స్థలం త్వరగా కేటాయించాలని ఆర్‌డీఓలకు, తహసీల్దార్లకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, ఏడీ సర్వే అండ్ రికార్డ్స్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

శ్రుతి మించితే ఇంతే

- వాహనదారులకు ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక
- పెద్ద శబ్దం చేసే బైక్ సైలెన్సర్లు ధ్వంసం
- ఆటో హారన్స్ కూడా



రోడ్డు రోలర్‌తో ఆటో హారన్లు, సైలెన్సర్లను తొక్కిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: రేయ్..సౌండ్ చేయకు..కంఠం కోసేస్తా అని ఓ సినిమాలో విలన్లకు హీరో వార్నింగ్ ఇస్తాడు. అచ్చం అలాగే సౌండ్ పెంచకు పర్యావసనాలు తీవ్రంగా ఉంటాయని ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను హెచ్చరిస్తూ ఆచరణలో చూపెడుతున్నారు. గత వారం రోజులుగా కర్నూలు నగరంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కొందరు యువకులు తమ ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు మార్చి రోడ్లపై పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ వేగంగా వెళ్తున్నారు. గుర్తించిన పోలీసులు దీనిని పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధమని తెలిసినా..

కొందరు విద్యార్థులు, యువకులు వేగంతో పాటు పెద్దపెద్ద శబ్దం వచ్చే సైలెన్సర్లను కోరుకుంటున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినప్పటికీ పట్టించుకోవడం లేదు. వ్యక్తిగత, తాత్కాలిక ఆనందం కోసం ఇతరులను ఇక్కట్లకు గురిచేస్తున్నారు. విద్యాసంస్థల నుంచి విద్యార్థులు బయటకు వచ్చి, వెళ్లే సందర్భాల్లో కొందరు పోకిరిగాళ్లు ద్విచక్ర వాహనాలపై రయ్‌మంటూ దూసుకెళ్తూ సమీపంలో ఉన్న వారంతా ఒక్కసారిగా కంగారు పడేలా శబ్దాలు చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. విద్యాసంస్థల వద్ద కొందరు విద్యార్థుల వెకిలీ చేష్టలను గుర్తించిన పోలీసులు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ట్రాఫిక్ పోలీసులు వారం రోజుల వ్యవధిలోనే 15 మంది విద్యార్థుల వాహనాలకు సంబంధించిన సైలెన్సర్లను తొలగించి ధ్వంసం చేశారు.


వెయ్యికి పైగా ఆటో హారన్స్ ధ్వంసం

ద్విచక్రవాహనదారుల మాదిరిగానే కొందరు ఆటో నిర్వాహకులు సౌండ్ ఎక్కువ వచ్చే హారన్స్‌ను ఉపయోగిస్తున్నారు. అలాంటి ఆటోలపై ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి వెయ్యికి పైగా హారన్లను ఊడదీశారు. వాటిని శుక్రవారం కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద రోడ్డు రోలర్‌తో తొక్కించారు.

ప్రత్యక్ష చర్యలపై దృష్టి

ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు హెచ్చరికలు, కౌన్సెలింగ్‌లతో ప్రయోజనం లేకపోవడంతో పోలీసులు ప్రత్యక్ష చర్యలపై దృష్టి సారించారు. తనిఖీల్లో పట్టుబడిన వాహనాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన సైలెన్సర్లు, పెద్ద శబ్దాలు చేసే హారన్లను పూర్తిగా తొలగిస్తున్నారు. మార్పు రాకపోతే వాహనాలను జప్తు చేస్తామని పోలీసు అధికారులు చెబుతున్నారు.

ఇకపై వాహనాలు జప్తు చేస్తాం



ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా కంపెనీలు సైలెన్సర్లను ఏర్పాటు చేస్తుంటాయి. వాటిని తొలగించడం, మార్పు చేయడం, అత్యధిక శబ్దం చేసేలా రూపొందించడం చట్టరీత్యా నేరం. ఇలాంటి వాహనాలు పట్టుబడితే ఇకపై జప్తు చేసి రవాణా శాఖ అధికారులకు అప్పగిస్తాం.

– నాగభూషణం, ట్రాఫిక్ డీఎస్పీ

ఈ రోజు

నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని కల్లూరు ప్రాంతంలో చేపట్టే అభివృద్ధి పనుల కారణంగా శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఎస్టేట్ ఆపరేషన్స్ ఏఈ నాగప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కృష్ణానగర్, ఆదిత్య నగర్, శరీఫ్ నగర్, రాఘవేంద్ర నగర్, ఐటీసీ కాలనీ చుటు పక్కల ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ప్రత్యేక సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్)లో శనివారం ట్రైనింగ్ అండ్ విజిట్ (టీఅండ్‌వీ) ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆర్‌ఏఆర్‌ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(ఏడీఆర్) వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి వ్యవసాయ అధికారులు హాజరుకానున్నారు.

విన్నపాలు

స్వయం ఉపాధికి రుణాలివ్వాలని వినతి

కర్నూలు(రూరల్): జిల్లాలోని ఎస్సీ యువతకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని ఏఐవైఎఫ్, డీహెచ్‌పీఎస్ సంఘాల నాయకులు కోరారు. ఈ అంశంపై శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి వినతి పత్రం అందజేశారు.

క్రీడా మైదానానికి స్థలం కేటాయించండి

కర్నూలు(రూరల్): బుధవార పేటలోని కిందిగేరిలో మత్స్య శాఖకు చెందిన స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయించాలని క్రీడా సంఘాల నాయకులు,ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు శుక్రవారం 20వ వార్డు సచివాలయంలో మున్సిపల్ కమిషనర్ భర్గవ్ తేజను కలిసి వినతి పత్రం అందజేశారు.

క్రైం కార్నర్

హత్యకేసులో నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న తాలూకా పోలీసులు

కర్నూలు: మండల పరిధిలోని పసుపుల గ్రామ పంచాయతీ మజరా గ్రామం నూతనపల్లెలో రైతు దండు ఆరోగ్యస్వామి హత్యకేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పొలం తగాదా విషయంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం హత్యకు దారి తీసినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. హతుని సోదరుడి కుమారులు దండు రాజశేఖర్, దండు ప్రవీణ్ కుమార్, వారి తల్లి సుజానమ్మ తదితరులను శుక్రవారం ఉదయం వెంకాయపల్లె గ్రామ శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజ్ దగ్గర ఉన్న బస్టాప్ వద్ద అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీరాం ఎస్‌ఐలు రామయ్య, మన్మథ విజయ్‌లతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు. హతుడు ఆరోగ్యస్వామికి ముగ్గురు సోదరులు కాగా వారికి పెద్దల నుంచి సంక్రమించిన భూమి పంపకాల విషయంలో గొడవలు జరిగి హత్యకు దారి తీసినట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్నూలు: కల్లూరు ఎస్టేట్‌లోని శివప్ప నగర్‌లో నివాసముంటున్న తిరుమలేష్ (33) చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. కూలీ పని చేస్తూ జీవనం సాగించే ఈయన కొంతకాలంగా తాగుడుకు అలవాటు పడ్డాడు. దీనికి తోడు కడుపునొప్పి కూడా భరించలేనంతగా వచ్చేది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. భార్య రామాంజనమ్మ కుటుంబ సభ్యుల సహాయంతో ఆటోలో ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. కడుపునొప్పి బాధ భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగో పట్టణ పోలీసులు తెలిపారు.

సేవలు అందిస్తూ..సంక్షేమ పథకాలు తెలియజేస్తూ

మహిళతో థంబ్ వేయించుకుంటున్న ఈ యువకుడి పేరు మనోహర్. పదోతరగతి చదువుకున్న ఈ యువకుడికి ప్రభుత్వం వలంటీర్‌గా అవకాశం కల్పించడంలో కృష్ణానగర్‌లోని 95 వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. కాలనీలో 100 కుటుంబాలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ అర్హులైన వారు వాటిని దరఖాస్తు చేసుకుని పొందేలా చూస్తున్నాడు. ప్రతి నెలా 1వ తేదీ ఉదయమే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వలంటీర్ వ్యవస్థ ద్వారా తమకు ఇంటి వద్దే సేవలు అందుతున్నాయని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వైఎస్ఆర్ పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ మనోహర్

భరోసా లభించింది



రజక వృత్తిపై ఆధారపడి జీవించే నాకు చిన్నప్పటి నుంచి చెవుడు. గతంలో ప్రభుత్వ పెన్షన్ కోసం కాళ్లరిగేలా తిరిగాను. ఎవరూ పట్టించుకోలేదు. పింఛన్ భాగ్యం లేదనుకున్నా. అంగవైకల్యం సమస్య ఉన్నట్లు తెలుసుకున్న వలంటీర్ మనోహర్ మా ఇంటికి వచ్చి వివరాలు తీసుకుని పెన్షన్‌కు దరఖాస్తు చేయించాడు. ఇప్పుడు ప్రతి నెల నాకు రూ.3 వేలు వైఎస్ఆర్ పెన్షన్ వస్తుంది. నా కూతురు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా చదువు పూర్తిచేసింది. పెన్షన్ మంజూరుతో భరోసా లభించింది.

– సి.నాగేంద్రమ్మ, విఠల్ నగర్

సంక్షిప్తం

ఉచిత కంటి వైద్య శిబిరం

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సుశీల నేత్రాలయ అధినేత డాక్టర్ సుధాకర్ రావు సౌజన్యంతో శుక్రవారం వీకర్ సెక్షన్ కాలనీలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ రాష్ట్ర ధర్మప్రసార్ కన్వీనర్ అనంత విశ్వప్రసాద్ మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షులు మద్దిలేటి, రాష్ట్ర బజరంగ్ దల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, విభాగ్ కన్వీనర్ నీలి నరసింహ, జిల్లా సేవా ప్రముఖ్ తుంగా రమేష్, నగర కార్యదర్శి నాగరాజు, విద్యార్థి కన్వీనర్ అరుణ్‌కుమార్‌రెడ్డి, ధర్మప్రసార్ కన్వీనర్ చంద్ర పాల్గొన్నారు.

ఇల్లూరు నగర్ యూపీహెచ్‌సీ తనిఖీ

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఇల్లూరు నగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌ను శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. జాతీయ కార్యక్రమాల లక్ష్యాలను వంద శాతం చేరుకోవాలన్నారు. అన్ని యాప్‌లలో వంద శాతం అప్‌లోడ్ జరగాలని చెప్పారు. ప్రతిరోజూ 15 హెల్త్ ఐడీలు జనరేట్ చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

కర్నూలు(హాస్పిటల్): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. శుక్రవారం స్థానిక బుధవారపేటలోని ఆదరణ డేకేర్ సెంటర్‌లో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. వృద్ధులను కుటుంబసభ్యులు ఆదరించాలన్నారు. వృద్ధాప్యంలో వారిని బాగా చూసుకుంటేనే పిల్లలు సైతం వారి తల్లిదండ్రులను పెద్దయ్యాక అలాగే చూస్తారన్నారు. కార్యక్రమంలో ఆదరణ డేకేర్ సెంటర్ నిర్వాహకులు రంజిత్‌కుమార్, స్థానికులు రాఘవేంద్ర పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(రూరల్): నగరంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి. నిర్మల డిమాండ్ చేశారు. నగరంలోని నరసింహారెడ్డి నగర్, అశోక్ నగర్, లేబర్ కాలనీ, భగత్‌సింగ్ నగర్‌లో సీపీఎం బృందం పర్యటించింది.

రీసర్వే వివరాలు సరిచూసుకోండి

కర్నూలు(సెంట్రల్): రీసర్వే జరుగుతున్న గ్రామాలకు సంబంధించిన డేటా సక్రమంగా ఉందో లేదో తహసీల్దార్లు, ఇతర అధికారులు సరిచూసుకోవాలని కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మీ కుమారి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డేటాసెంటర్‌లో డిస్ట్రిక్ట్ ల్యాండ్ రికార్డ్స్(డీఎల్ఆర్) కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆర్‌డీఓ హరి ప్రసాద్, సర్వే ఏడీ శ్రీరామమోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి రైతు భూ వివరాలు పక్కగా ఉంచాలన్నారు. తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. అనంతరం వచ్చిన రెవెన్యూ సిబ్బంది తమ తమ గ్రామాలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు.

18న రోప్ స్కిపింగ్ జిల్లా జట్టు ఎంపికలు

కర్నూలు(రూరల్): నగరంలోని బీ క్యాంప్ క్రీడా మైదానంలో ఈ నెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు రోప్ స్కిపింగ్ బాలబాలికల జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు రోప్ స్కిపింగ్ సంఘం జిల్లా కార్యదర్శి అబ్దుల్ రహిమాన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికలను 10,12,14,17,19 సంవత్సరాల లోపు వారికి నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరుకావాలన్నారు. వివరాలకు 99492 57657 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

25న డాక్ అదాలత్

కర్నూలు(రూరల్): తపాలా శాఖ అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు స్వీకరణకు ఈ నెల 25వ తేదీన విజయవాడ సర్కిల్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసర్ లక్ష్మణ్ నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్ట్ కవర్ ద్వారా పంపే వారు డాక్ అదాలత్ అని పెద్ద అక్షరాలతో రాసి చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్, ఏపీ సర్కిల్, విజయవాడ– 520013 చిరునామాకు 21 తేదీలోపు పంపాలన్నారు. 25వ తేదీ నేరుగా కూడా హాజరుకావచ్చన్నారు.

ఆగస్టు నుంచి 'టేక్ హోమ్ రేషన్'

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆగస్టు 1 నుంచి టేక్ హోమ్ రేషన్ విధానాన్ని అమలు చేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టేక్ హోమ్ రేషన్ ద్వారా గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దనే కిట్లు అందజేయాలన్నారు కిట్లను నాణ్యతా ప్రమాణాలు పాటించి తయారు చేసేలా చూడాలని జేసీలను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ జి.సృజన, అధికారులు పాల్గొన్నారు.

రేపు పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత ఎస్.షేక్షావలి రచించిన 'ఆర్థికంగా భారత దేశాభివృద్ధి' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ సాహితీ వేత్తలు తమ్మిచెట్టి ప్రసాద్, పత్తి ఓబులయ్య ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. సీతారామ కృష్ణ శర్మ, బెలదోన కృష్ణ మూర్తి, ఇనాయతుల్లా పుస్తక సమీక్ష చేస్తారని తెలిపారు.